

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం

- ఎంపీడీవో దివ్యదర్శన్ రావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ఎంతమందికి మంజూరు అయ్యాయి?

ఎంపీడీవో: మండలంలో 12,300 దరఖాస్తు లు రాగా 4,600 మందిని అర్హులుగా గుర్తించాం. మొదటి విడతగా మండలానికి 800 గృహాలు వచ్చాయి. దశల వారీగా వీటిని కేటాయిస్తాం. పైలెట్ ప్రాజెక్టు కింద మొదట విడతగా మండలంలోని కాట్నపల్లి గ్రామాన్ని ఎంపికచేసి 167 మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల మంజూరు చేశాము.

ఆంధ్రజ్యోతి: నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయి?

ఎంపీడీవో: 167 ఇళ్లలో ఇప్పటివరకు 70 మంది ముగ్గులు పోసుకున్నారు. 49 మంది బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసుకున్నారు. వారికి లక్ష రూపాయల చొప్పున వారి ఖాతాలో జమ చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల డిజైన్ ఎలా ఉండాలి?

ఎంపీడీవో: 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 మించకుండా ఇళ్లను నిర్మాణం చేయాలి. హాల్, బెడ్ రూమ్, వంట గది, టాయ్‌లెట్స్ ఉండి తీరాలి.

- సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి)

- వార్షిక మరమ్మతులతో ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి నిలిపివేత
- జూన్ రెండోవారంలోనే ఉత్పత్తికి అవకాశం
- మే నెలలో కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది 50వేల టన్నులే
- ఈ ఏడాది సీజన్‌కు ముందే వర్షాలు
- వ్యవసాయశాఖ వద్ద పడిపోయిన బఫర్ స్టాక్



యూరియా టెన్షన్

కోల్‌సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాలం సీజన్‌కు ముందే యూరియా టెన్షన్ మొదలైంది. రాష్ట్రంలో యూరియా సరిపడేంత బఫర్ స్టాక్ (నిల్వలు) లేదు. దీనికితోడు రాష్ట్ర రైతాంగానికి ప్రధా న యూరియా సరఫరా చేసే రామగుండం ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో వార్షిక మరమ్మతుల కారణంగా యూరియా ఉత్పత్తిని నిలిపివేశారు. మే6వ తేది నుంచి ఉత్పత్తి నిలిచిపో యింది. ఏప్రిల్‌లోనే పరిశ్రమలో వార్షిక మరమ్మతులు చేయాల్సి ఉండగా రైతాంగం నుంచి యూరియా ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని మే నెలలో షడౌన్ చేశారు. ప్లాంట్‌లో కీలకమైన హెచ్‌టీఆర్ మరమ్మతు, అమ్మోనియా పైప్‌లైన్లు, ఇతర యంత్రాల నిర్వహణ చేయాల్సి ఉంది. సాధారణంగా వార్షిక మరమ్మతులకు 30 నుంచి 40 రోజులు పట్టే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై మర మ్మతుల విషయంలో ఒత్తిడి పెడుతుంది. దీంతో ప్రధానమైన హెచ్‌టీఆర్ (హీట్ ట్రాన్స్‌ఫర్ రీ ఫార్మర్)ను బైపాస్ చేసి మరమ్మతులు చేస్తున్నారు. తద్వారా పరిశ్రమను త్వరగా ఉత్పత్తి దశలో పెట్టాలని ప్రయత్నిస్తున్నారు.

● వ్యవసాయశాఖ వద్ద తక్కువ నిల్వలు..

వ్యవసాయశాఖ ఏప్రిల్ నుంచే సాధారణంగా బఫర్ స్టాక్ పెట్టుకుంటుంది. వేసవికాలంలో రాష్ట్రం లోని 33 జిల్లాల్లో గోడౌన్లలో యూరియా నిల్వలు ఉంచుతారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఏప్రిల్ నుంచే యూరియా సరఫరా ఉంటుంది. కానీ ఈసారి రాష్ట్రా నికి వర్షాకాలం సీజన్‌లో కేంద్రం నుంచి కేటాయిం పులే తక్కువ స్థాయిలో ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో 12లక్షల టన్నుల డిమాండ్ ఉంటే 9.8లక్షల టన్నులే కేటాయించారు. 2.2లక్షల టన్నుల వ్యత్యాసం ఉంది. దీనికి తోడు మే నెలలో లక్షా 50వేల టన్నులు కేటాయించాల్సి ఉండగా కేవలం 50వేల టన్నులే కేటాయించారు. దీనితో యూరియా నిల్వలు వ్యవసాయ శాఖ వద్ద రెండు లక్షల టన్నుల లోపే ఉన్నాయి. సాధారణంగా వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందు మూడున్నర లక్షల టన్నులు అందుబాటులో ఉంటేనే యూరియా కొరత లేకుండా ఉంటుంది.

● గత ఏడాది 4.68లక్షల టన్నుల సరఫరా

ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర రైతాంగానికి సకాలంలో యూరియా సరఫరా చేసి ఆదుకుంటుంది. గత ఏడాది 11.94లక్షల టన్నుల ఉత్పత్తి జరుగగా రాష్ట్రానికే 4.68లక్షల టన్నులు సరఫరా చేశారు. మొత్తం ఉత్పత్తిలో 45శాతం

(మిగతా 8వ పేజీలో)

ప్రశాంతంగా గ్రామపాలన అధికారి పరీక్ష

- అదనపు కలెక్టర్ వేణు



పరీక్ష కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ వేణు, అధికారులు

పెద్దపల్లి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపాలన అధికారి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అదనపు కలెక్టర్ డి వేణు తెలిపారు. ఆదివారం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపాలన అధికారి పరీక్షలకు పెద్దపల్లి జిల్లా లో 90 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 82 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. వారి వెంట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, అబ్జర్వర్ పురుషోత్తం తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని పట్టణంలో సోమవారం ఉదయం పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో, మండలంలోని గుంజపడుగు గ్రామంలో రూ. 2.90 కోట్లతో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతి పత్రాలను మంత్రి శ్రీధర్‌బాబు పీఏసీఎస్ పాలకవర్గానికి అందజేస్తారన్నారు. బస్ డిపో సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ డ్రిమ్స్ స్టార్టు అండ్ రైజ్ ఇనోమేషన్ నెట్‌వర్క్‌లో భాగంగా మంథని టౌన్, గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇనోవేషన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కృష్ణానగర్‌లో ఉచిత వైద్యశిబిరం

జ్యోతినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో భరత్ అండ్ టీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీరాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మందికి బీపీ, షుగర్, గుండె సంబంధిత, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని విజయవంతంగా నిర్వహించామని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొడిగె భరత్ గౌడ్ తెలిపారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కనకరాజు

కోల్‌సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలో సీపీఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కే కనకరాజు పేర్కొన్నారు. ఆదివారం 49వ డివిజన్ అశోక్ నగర్‌లో పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. సీపీఐకి అశోక్‌నగర్ బలమైన కేంద్రమని, రాబోయే రోజుల్లో కార్పొరేషన్ ఎన్నికల్లో సన్నద్ధం కావాలన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదమ్మ, దుబాసి రేణుక, ప్రశాంత్, మారెల్ల శ్రీలత, జంగా లక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

రామగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బండి మల్లేష్ భార్య బండి లక్ష్మి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఆదివారం దుస్తుల పంపిణీ చేశారు. ఈ మేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 మంది సిబ్బందికి మల్లేష్ తన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమణారెడ్డి, నాయకులు వేము కనకయ్య, వెన్నం శ్రీనివాస్, బండి శ్రీకాంత్, సూరం శ్రీనివాస్, బండి సంపత్ కుందరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

రామగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుతో పాటు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన 18 హమీలను అమలు చేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. వాంకిడి నుంచి ఆలంపూర్ వరకు చేపట్టిన బీసీల మేలుకొలుపు యాత్రలో భాగంగా ఆదివారం సెంటినరీకాలనీకి చేరుకున్న సంజయ్‌కుమార్ అంబేద్కర్, జ్యోతిబాపూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడారు. మంథనిలో తరాలుగా బీసీల అణచివేతకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. చేనేత పరిశ్రమ ఖాయిలా పరిశ్రమలా మారి, సిరిసిల్ల ఉరిసిల్లగా మారినా చేనేత మంత్రి గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. బీసీల సంక్షేమం కోసం వందల కిలోమీటర్లు రథయాత్ర చేపట్టానని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుతో పాటు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన 18 హమీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ జనరల్ సీటులో బీసీలకు పోటీకి నిలిపి కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమీటి మాజీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్, నాయకులు మేదరవేని కుమార్, శంకర్‌లాల్, గౌతం శంకరయ్య, చెల్కల జవాహర్, వేగొలపు మల్లయ్య, ధర్మల రాజసంపత్, రాజన్న, గాజుల ప్రసాద్, కొండవేన ప్రభాకర్, మల్యాల మోహన్, స్వామి, బొంకూరి రాజేశ్, గద్దల శంకర్, నూనే రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

పెద్దపల్లి(కమాన్‌పూర్) మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అంసెంబ్లీలో తీర్మాణం చేసిన 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసిన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని దేశవ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ మేలుకొలుపు రథయాత్ర ఆదివారం కమాన్‌పూర్ మండలానికి చేరుకుంది. జక్కని సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీసీ నేతలు పాల్గొని జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్యా, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వాటాను అందించాలని కోరారు. కార్యమంలో మహనీయుల కమిటీ అధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మండలాధ్యక్షుడు పొన్నం నవీన్, నాయకులు బొమ్మగాని అనిల్‌గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, మేకల సంపత్ యాదవ్, నీలం శ్రీనివాస్, పోల్దాసరి సాయికుమార్, రాజ్‌కుమార్, సాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తా విస్తరణకు శ్రీకారం
- సుల్తానాబదాద్‌లో ఐబీ గదుల కూల్చివేతకు రంగం సిద్ధం
- కొత్త గదుల నిర్మాణం ప్రారంభం 8

ఓదెల మల్లన్న ఆలయంలో భక్తుల సందడి 6

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

పెద్దపల్లి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేటలో విద్యుదాఘాతంతో ఆదివారం ఆవు మృతి చెందింది. గ్రామంలోని ఇటుక బట్టీ యజమాని శ్యాం అనే వ్యక్తికి చెందిన ఆవు ఆదివారం మేతకోసం పొలాల వైపు వెళ్లింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ వైర్లు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో తెగిపడటంతో మేతకు వెళ్లిన ఆవుకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని శ్యామ్ కోరారు.

బడిబాటలో విధిగా పాల్గొనండి

ఎలిగేడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం 8.30గంటలకు బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి అనసూరి నరేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బడిబాటపై ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. అమ్మఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌లు, సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళసంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యావంతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

'నంబాల' ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ చేయాలి

న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్



ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జి న్యాయ విచారణ జరిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఆపరేషన్ కగార్‌ను ఆపాలనే డిమాండ్‌తో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పహెల్‌గాంలో జరిగిన ఉగ్రదాడిలో నిందితులను ఇప్పటికీ కేంద్రం గుర్తించ లేదని, పట్టుకోలేదని, అమెరికా అధ్యక్షుడు చెబితే ఆపరేషన్ సింధూర్‌ను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. దేశంలోని విపక్ష నాయకులను సంప్రదించకుండానే యుద్ధాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపుతున్నారని, అడవిలో ఉన్న ఖనిజ, పకృతి సంపదను కార్పొరేట్‌కు అప్పగించేందుకు ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వ వాగ్దానాలను ప్రజలు నిలదీయాలని వారు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ నాయకుడు ఈ నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నాయకులు ఐ కృష్ణ, వెంకన్న, చిలుక శంకర్, రామకృష్ణ, రాజేశం, మేరుగు చంద్రయ్య, ముడిమడుగుల మల్లయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాంతినికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు



నారాయణపూర్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్/ఓదెల/కోల్‌సిటీటౌన్/యైటింక్లయిన్‌కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఓదెల మండలంలోని గుంపుల హైస్కూల్‌లో 2002, 2009లో 10వ తరగతి చదువుకున్న 43 మంది విద్యార్థులు, గోదావరిఖని గీతాంజలి హైస్కూల్ 2000-2001 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి పూర్వవిద్యార్థులు, గోదావరిఖనిలోని శాంతినికేతన్ పాఠశాలలో 2005-06 బ్యాచ్ విద్యార్థులు కలిసి రోజంతా ఆహ్లాదంగా గడిపారు. అందరూ ఒకచోట చేరి ఆడిపాడారు. తమకు చదువు చెప్పి ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం చేశారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.



గీతాంజలి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఉద్యోగం రాదనే బెంగతో యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

గంభీరావుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాదనే బెంగతో బీటెక్ చదివిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన రాజన్నసిరిసిల్లజిల్లా గంభీరావు పేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గుడికాడి సంపత్ (23) రెండేళ్లక్రితం బీటెక్ పూర్తిచేశాడు. రెండే ళ్లుగా ఆయా కంపెనీలు చుట్టూ ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు. చాలా ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. అయినా సంపత్ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఉద్యోగం రాదనే బెంగ సంపత్‌ను వెంటాడింది. ఉద్యోగ ప్రయత్నంలో తాను ఓడిపోతున్నాననే మానసిక బాధను తల్లిదండ్రులతో చెప్పుకునేవాడు. ఆదివారం ఇంట్లో వాళ్లు ఓ శుభకార్యానికి వెళ్లగా సంపత్ తమ వ్యవసాయ పొలం వద్ద షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. మృతుడికి తండ్రి శ్రీనివాస్, తల్లి సత్తవ్వ, చెల్లె తేజ ఉన్నారు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరికి స్వల్పగాయాలు



ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

చందుర్తి మే 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాల య్యాయి. గ్రామస్థుల పోలీసుల కథనం ప్రకారం కథలాపూర్ మండ లంకు చెందిన కర్క రాజేష్ అనే వ్యక్తి వేములవాడ వైపు వెళ్తుండగా, నిజామాబాద్‌కు చెందిన రాహుల్ అనేవ్యక్తి వేములవాడ రాజన్న దర్శనం చేసుకొని వెళ్తుండగా చందుర్తిలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో చందుర్తి ఎస్ఐ అంజయ్య వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు.ఈ సంఘటనపై విచారణ చేపట్టమని ఎస్ఐ పేర్కొన్నారు.

ఓదెల మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



ఆలయ సమీపంలోని చెట్ల కింద భక్తులు

ఓదెల, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సందడి చేశారు. రోహిణి కార్తె ప్రవేశించిన సందర్భంగా వివిధ జిల్లాలు, మండలాల నుంచి రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన భక్తులు తరలివచ్చి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. కోడె మొక్కులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన భక్తులు, బోనాలతో మల్లన్నకు మొక్కులు సమర్పించారు. అనంతరం భ్రమరాంబ మల్లికార్జునస్వామికి మొక్కులు సమర్పించిన తరువాత బంగారు పోచమ్మ , మదన పోచమ్మకు మొక్కులను సమర్పించారు.

ముడుపుల సొమ్ము లెక్కింపు

మల్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులలో కొన్నింటిని ఆదివారం దేవస్థానం అధికారులు విప్పి అందులోని సొమ్ములను లెక్కిం చారు. ఇందులో రూ.85,094 నగదు లభించింది. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షణ అధికారిరాజమౌళి, సుపరింటెండెంట్లు చంద్ర శేఖర్, హరిహరనాథ్, సిబ్బంది,శ్రీవల్లి సేవాసమితిసభ్యులు పాల్గొన్నారు.

భక్తుడికి సెల్‌ఫోన్ అప్పగించిన ఈవో

ధర్మపురి, మే 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో తొగుట లక్ష్మణాచారి అనే ఒక భక్తుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు అప్పగించాడు. కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన లక్ష్మణాచారి ఉదయం స్వామి దర్శనం కోసం వచ్చాడు. ఆ సమయంలో అతను తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది బీరయ్యకు సెల్‌ఫోన్ దొరకగా వెంటనే ఆయన ఈవో శ్రీనివాస్‌కు అప్పగించాడు. ఆయన మైక్ ద్వారా అనౌన్స్ మెంట్ చేయించగా ఫోన్ పోగొట్టుకున్న భక్తుడు లక్ష్మణాచారి వచ్చి ఈవో చేతుల మీదుగా తీసుకున్నాడు.



డిగ్రీలో కొత్త కోర్సు

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్

- దోస్త్ విధానంలో ప్రవేశాల ప్రక్రియ
- తృతీయ సంవత్సరంలో భృతి

గణేశ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైద్యరం గంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు పెరుగు తున్నాయి. కొన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారి కొరత వేధిస్తోంది. వాటిని అధిగమించి యువత త్వ రగా స్థిరపడేందుకు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సును ప్రభు త్వం ప్రవేశ పెట్టింది. దోస్త్ విధానంలో ప్రవేశాల ప్రక్రి య కొనసా గుతోంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్రిస్ (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్) విభాగం ఈ కోర్సును రూపొందించింది.

● ఉద్యోగ అవకాశాలు

మూడేళ్ల కోర్సు పూర్త వగానే విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగావకాశాలు ఉంటాయి. హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్, హాస్పిటల్ మేనేజర్, హెల్త్ ఇన్సూరెన్సు అనలిస్టు, మెడికల్ ఆఫీస్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్ డాటా అనలిస్టు, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్, హెల్త్ కేర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యో గాలు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్య బీమా, మెడికల్ టూరిజం కంపెనీలు, క్లినికల్ పరిశోధనా సంస్థలు, వైద్యా రోగ్య శాఖ, హెల్త్ టెక్ స్టార్టప్స్ విభాగాల్లో స్థిరపడవచ్చు. నైపుణ్యం ఉన్న వారికి అమెరికా, కెనడా, యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే దేశాల్లో అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్మెంట్, ఎంపీహెచ్ (మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ (హెల్త్ అడ్మినిస్ట్రేషన్), పీజీ డిప్లొమా- క్లినికల్ రీసెర్చ్, హెల్త్ ఎకనామిక్స్ కోర్సులు చదువుకోవచ్చు.



● కోర్సులో అంశాలు

ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రక్షణ సంస్థలు, ఆసుపత్రి పాలనా విభాగం, ఆర్థిక నిర్వహణ, వైద్య నైతిక విలువలు, ఆరోగ్య సమాచార వ్యవస్థ, నాణ్యతా ప్రమాణాలు, ప్రజా రోగ్య వ్యాధుల నియంత్రణ వ్యవస్థ తదితర అంశాలు కోర్సులో పొందుపర్చారు. రెండేళ్ల కళాశాలలో చదువు కోవాలి. అధ్యాపకులతో పాటు ఆయా రంగాల నిపుణులను ఆహ్వానించి తర గతులు బోధిస్తారు. మూడో సంవ త్సరం విద్యార్థులు అప్రెంటిస్ షిప్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రుల్లో విద్యార్థులు చేరాల్సి ఉంది. విద్యా ర్థులకు ప్రతి నెలా తొమ్మిది వేల రూపా యల భృతి చెల్లిస్తారు. ప్రభుత్వం, విద్యార్థులు పని చేసే సంస్థ 50 శాతం చొప్పున చెల్లిస్తాయి.

విద్యార్థులకు చక్కటి అవకాశం

- ప్రొఫెసర్ డి వరలక్ష్మి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



వైద్య రంగంలో కొన సాగాలని, త్వరగా స్థిరపడాలని ఆశించే వారికి ఈ కోర్సు చక్కటి అవకాశం. మా కళాశాలలో హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

జ్యోతినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 5వడివిజన్ పరిధి లోని నర్రశాలపల్లిలో ఆదివారం ప్రియుడి ఇంటిఎదుట ప్రియురాలు(26) బైఠాయిం చింది. గ్రామానికి చెందిన యువతి, అదే కాలనీకిచెందిన బంధువైన యువకుడు ప్రేమించుకున్నారు. అయితే ఆ యువతి తల్లిదండ్రులు వారిప్రేమను అంగీకరించ కుండా మంచిర్యాలజిల్లాకు చెందిన వేరే యువకుడితో మూడేళ్లక్రితం పెళ్లిచేశారు. పెళ్లితరువాత కూడా ఆయువతి ప్రియు డితో ప్రేమ కొనసాగించింది. ఈ క్రమంలో ఆ యువతి ఒకపాపకు జన్మనిచ్చింది. అయినా వారిద్దరి మధ్య బంధం కొనసాగు తూనే ఉంది. మూడునెలల క్రితం భర్తను విడిచిప్రియుడితో వెళ్లిపోయింది. మంచిర్యా లలోనే ఒక ఇళ్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు. ఈనేపథ్యంలో తమ కూతురు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసునమోదైంది. తరువాత దర్యా ప్తులో ఆ యువతి జాడ తెలుసుకొన్న ఎన్టీ పీసీ పోలీసులు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమించిన యువకుడినే పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు స్పష్టం చేసింది. తల్లిదండ్రులు కులపెద్దల సమక్షంలో పంచాయతీపెట్టారు. ప్రియు రాలు భర్తకువిడాకులిస్తే పెళ్లి చేసుకుంటా నని ప్రియుడుతెలిపాడు. ప్రియుడి మాట లు నమ్మిన ఆమె విడాకులు తీసుకుంది. అయితే విడాకులు తీసుకున్న తరవాత ఆ యువతితో పెళ్లి చేసుకునేందుకు ప్రియుడు నిరాకరించాడు. దీంతో ఆమె తాడోపేడో తేల్చుకునేందుకు ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి నిరసనకుదిగింది. దీంతో ప్రి యుడు, తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఎన్టీపీసీ ఎస్ఐ-2 మానస ఆ ఇంటివద్దకు చేరుకొని యువతికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పూర్తివివరాలతో ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, న్యా యంజరిగేలా చూస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో ఆ యువతి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

మట్టి కోసమా? గుప్త నిధుల కోసమా?

- తాపాల నర్సింహస్వామి గుట్ట చుట్టూ తవ్వకాలు

తిమ్మాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో దిగువమానేరు జలాశయంలో ఉన్న శ్రీతాపాల నర్సింహస్వామి గుట్ట చుట్టూ కొందరు ఆదివారం మట్టి తవ్వకాలు జరిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాపాల నర్సింహస్వామి గుట్టచుట్టూ ఆదివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కావేటర్‌తో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఇది గమనించిన రైతులు గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు తవ్వకాలు జరిపే ప్రదేశానికి వెళ్లి ఎందుకు తవ్వుతు న్నారు అని ప్రశ్నించారు. దీంతో వారు పొంతన లేని సమాధానం చెబుతూ గొడవకుదిగారు. తమకు ఇరిగేషన్‌శాఖ అధికారుల అను మతులు ఉన్నాయని గ్రామస్థులపై ఎదురుదాడికి దిగారు. దీంతో గ్రామస్థులు సంబంధిత అధికారులను అడిగారు. అధికారులు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పడంతో గ్రామస్థులు వారిని నిలదీశారు. దీంతో వారు సమాధానం చెప్పలేక అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇంతకీ దేనికోసం తవ్వకాలు జరిపారో విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



గుట్ట వద్ద ఎక్స్‌కావేటర్‌తో తవ్వకాలు

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన



హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు విశేష స్పందన లభించింది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాహ్యాండ్‌బాల్ అసోసియే షన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఎంపికైన జట్లు జూన్ 4, 5, 6 తేదీల్లో నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగే 47వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అధ్యక్షకార్యదర్శులు తెలిపారు. సంఘం సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్‌మూల వెంకటేశ్, దాసరిమల్లేశ్, పెద్దపల్లి సురేందర్, సిరిసిల్ల కృష్ణహరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, తిరుమలేష్, శ్రీకాంత్, విజయ్, సూర్య, అమర్‌రాజ, సాయి, శివాజీ పాల్గొన్నారు.

ధాన్యం రాశులను ధ్వంసం చేసిన అడవి పందులు

చందుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకు రాగా అడవిపందులు ధ్వంసం చేశాయి. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన రైతు ఆలూరి లక్ష్మణ్‌రావుకు చెందిన ధాన్యం రాశులను శనివారం రాత్రి అడవి పందులు చెల్లా చెదురు చేశాయి. గ్రామానికి సమీపన అటవీ ప్రాంతం విస్తరించి ఉండటంతో అడవి పందులు,కోతులు, తదితర వన్య ప్రాణులు సరిహద్దు గ్రామాల్లోని పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెలలు దాటినా కొనుగోళ్ల లేక నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పి కెమికల్ ట్యాంకర్ బోల్తా

సుల్తానాబాద్, మే 25: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని సుగ్లాంపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఓ కెమికల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి నుంచి రామగుండం బయలు దేరిన కెమికల్ ట్యాంకర్ సుగ్గాంపల్లి వద్ద ఆదివారం తెల్లవారుఝామున రాజీవ్ రహదారి పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను సమీపప్రాంత యువకులు బయటకు తీశారు. నిద్రమత్తులో ప్రమాదం జరిగిఉంటుందని భావిస్తున్నారు. డ్రైవర్‌స్వల్పగాయాలతో బయటపడ్డారు.



సుగ్లాంపల్లి వద్ద బోల్తా పడ్డ ట్యాంకర్

వర్షానికి కూలిన ఇళ్లు

ధర్మపురి, మే 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం లోని నేరెళ్ల గ్రామంలో మూడు రోజుల నుంచి కురిసిన వర్షానికి ఓరుగంటి లక్ష్మి, ఆశయ్య, మంత్రి భూమక్క ఇళ్లపైకప్పు కూలిపోయాయి. కాంగ్రెస్‌పార్టీ మండల అధి కారప్రతినిధి, న్యాయవాదిజాజాల రమేష్,మాజీ ఎంపీటీసీ రెడ్డవేని సత్యంకలిసి కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా వచ్చే సాయం అందించే విధంగా కృషి చేస్తానని బాధితులకు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

మానకొండూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనే యులు (23) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరివే సుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానిక గుట్ట వద్ద గల చెట్టుకు ఉరివేసుకొని మృతి చెం దాడు. మృతికి గల కారాణాలు తెలియాల్సి ఉంది.

సుందరీకరణకు మోక్షమెప్పుడు..?

- ప్రమాదకరంగా మారిన నాంపల్లి చౌరస్తా
- రోడ్డు వెడల్పు చేయాలంటున్న వాహనదారులు
- కూడలిని అందంగా తీర్చిదిద్దాలని డిమాండ్



నాంపల్లి గ్రామపంచాయతీ చౌరస్తా

వేములవాడ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్‌లో విలీనమైన నాం పల్లి గ్రామ కూడలి సుందరీకరణకు నోచుకో వడం లేదు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఇరుకైన రోడ్డును డబుల్ చేసి కాస్త పొడిగించారు. మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడుస్తున్నా నాంపల్లి గ్రామం కూడలి సుందరీకరణకు నోచుకోకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేము లవాడ పట్టణంలోని పధాన కూడళ్లను సుంద రీకరించిన నాంపల్లి కూడలి పైన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో నాంపల్లి గ్రామ కూడలిని సుందరీకరించాలనే డిమాండ్ వినబడుతోంది. వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి ఆలయానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు నిత్యం వేల సంఖ్యలో తరలివస్తుంటాన్నారు.

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి గ్రామం నుంచి ప్రారంభమ వుతున్న సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్, బొజ్జపల్లికి వెళ్లే నాలుగు రోడ్ల కూడలి కావ డంతో భక్తులు, స్థానిక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిప్పాపూర్ నుంచి నాంపల్లి పోచమ్మ ఆలయం వరకు రెండు వరుసల రోడ్డు పూర్తి అయినప్పటికి పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి చౌరస్తా వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహన దారులకు ఇబ్బందిగా మారింది. పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి చౌరస్తా వరకు రెండు వరుసల రోడ్డును చేస్తే వాహన దారులకు అనుకూలంగా ఉంటుందని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు. నాంపల్లి గుట్టపైన కొలువుదీరిన లక్ష్మీనృసింహస్వామిని దృష్టిలో పెట్టుకుని కూడలి అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేయాలి..

- పండుగు శంకర్, సంకెపల్లి, వాహనదారుడు



తిప్పాపూర్ నుంచి నాంపల్లి వరకు రెండు వరుసల రోడ్డు పూర్తిచేసి పోచమ్మ ఆలయం నుంచి నాంపల్లి గ్రామపంచాయతీ వరకు నిలిపివేశారు. నాంపల్లి గ్రామంలో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం వేల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో రాత్రి వేళలో ఇబ్బందులు అవుతున్నాయి. నాంపల్లి గ్రామంలో సైతం రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేసి భక్తులకు, స్థానిక గ్రామల వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కూడలిని తీర్చిదిద్దాలి..

- బొల్లు తిరుపతి, నాంపల్లి గ్రామస్థుడు



నిత్యం రాజన్న ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు స్వాగతం పలికే నాంపల్లి గ్రామపంచాయతీ వద్దగల కమాన్ చౌరస్తా రూట్‌లు సరిగా లేక వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పట్టణంలోని చౌరస్తాలను అందంగా తీర్చిదిద్దినట్లుగా నాంపల్లి చౌర స్తాను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

29 క్వింటాళ్ల రేషన్ సన్న బియ్యం పట్టివేత

మంథని, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా నిల్వచేస్తున్న 29.20 క్వింటాళ్ల రేషన్‌సన్న బియ్యాన్ని పెద్దపల్లిజిల్లా మంథని పట్టణ శివా రులో సివిల్ సప్లయిస్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. మంథని ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మంథని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న రేకుల షెడ్‌లో పీడీ ఎస్ సన్నబియ్యాన్ని అక్రమంగా నిల్వచే యటానికి టీఎస్02యూడీ1387 అనే నంబర్ గల వాహనంలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు అక్కడి వెళ్లగా వాహన డ్రైవర్ పరారయ్యాడు. బియ్యం బస్తాలతో ఉన్న వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా నల్లవెల్లి సది అనే వ్యక్తి అడ్డుపడి అధికారు లను దూషించాడు. నల్లవెల్లి సదితోపాటు వాహనం యజమాని ఆరె సంజీవ్, డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ. 1.78 లక్షలు ఉంటుంది.



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

ప్రశాంతంగా డీఈఈ సెట్



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన డీఈఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 137 మందికి గాను 100 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 144 మందికి గాను 103 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారని ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భక్తజన ప్రభంజనం

పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

- కిక్కిరిసిన కాళేశ్వర ముక్తీశ్వరాలయం
- 11వ రోజు 3.50 లక్షల మంది పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానాలతో భక్తులు పులకించి పోతున్నారు. కనీవినీ ఎరగని రీతిలో అంచనాలకు మించి సరస్వతి పుష్కరాలకు భక్తులు బారులు తీరారు. ఆదివారం 11వ రోజు పుణ్యసానాలు ఆచరించడానికి వచ్చిన భక్తజన సందోహంతో కాళేశ్వర క్షేత్రం కళకళలాడింది. స్నానమాచరించే ఘాట్లతో పాటు ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ సమస్య యథావిధిగానే పునరావృతమైంది. నియంత్రణ చర్యలు చేపట్టడంలో పోలీసుశాఖ వైఫల్యాన్ని చవిచూడాల్సి వచ్చింది. వాహనాల అస్తవ్యస్తంతో పాటు భక్తుల ఇక్కట్లను తెలుసుకున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా జిల్లా పోలీసు బాస్‌పై మంత్రి మండిపడి వారి వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సుమారు 3.50 లక్షల మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు.



కాళేశ్వరం, ముక్తీశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

నేడు చివరి ఘట్టం

సరస్వతి పుష్కరాల చివరి ఘట్టం సోమవారంతో ముగియనుంది. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీతో 12 రోజులతో పరిసమాప్తి కానుంది. చివరి రోజు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో భక్తులు మరింత భారీగా తరలి వచ్చే అవకాశాలున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. ఆదివారమే చాలా మంది కాళేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. ఇక్కడ బస చేసి సోమవారం దర్శించుకునేలా కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.



ట్రాఫిక్ సమస్య తీవ్రం

పుష్కరాలకు వచ్చి వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తింది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు15 కిలోమీటర్ల నిడివిలో ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు ఆలస్యంగా తేరుకొని ఔట్ గోయింగ్ బస్సులు, కార్లను పూస్కుపల్లి మీదుగా మళ్లించినప్పటికీ అటు కూడా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో భక్తులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకపోయారు. గంటల కొద్ది వాహనాలు కదలకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు ఆకలి, దప్పికతో అలమటించి పోయారు. కాళేశ్వరం వచ్చివెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ సమస్య కారణంగా ఆర్టీసీ బస్సులు, కార్లలోనే గంటల తరబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలకు మహదేవపూర్ చేరుకున్న వాహనాలు సాయంత్రం 5 గంటల వరకు కూడా కాళేశ్వరానికి చేరుకోలేకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు.

వైభవంగా నవరత్నమాల హారతి

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని 11వ రోజైన ఆదివారం రాత్రి 7.00 గంటల నుంచి 7.45 గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో పలు అష్టకాలతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో కార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు.



హారతినిస్తున్న కాశీ పండితులు



కిక్కిరిసిన కాళేశ్వరం దారి

వచ్చేనెల 8 వరకు శుభ ముహూర్తాలు

- జూలై 25 వరకు లేవు
- తిరిగి శ్రావణమాసంలోనే శుభకార్యాలు
- 28తో ముగియనున్న వాస్తు కర్తరి

కరీంనగర్ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తాలకు కొద్దిరోజులే మిగిలిఉంది. వివాహాది శుభకార్యాలకు జూన్ 8వతేదీ వరకే ముహూర్తాలు ఉన్నాయి. ఈ స్వల్పకాల వ్యవధిలోనే వేలాది సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. దీంతో పెళ్లి మండపాలు, పురోహితులు, బాజా భజంత్రీలు, ఈవెంట్స్ నిర్వాహకులు, వంటవారు, పూలు, అలంకరణలు, దుస్తులు, కిరాణం వంటి వివిధ షాపుల వారికి గిరాకీ పెరగనుంది. జూన్ 9వ తేదీ నుంచి గురు మౌఢ్యంతో జ్యేష్ఠ మాసం అనగా జూన్‌లో ముహూర్తాలు లేవు. ఆ తర్వాత జూన్ 26వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కారణంగా ముహూర్తాలు లేవు. జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీవరకు శ్రావణమాసంలో తిరిగి ముహూర్తాలున్నాయి. ఆగస్టు 24వతేదీ నుంచి భాద్రపదమాసం, సెప్టెంబరు 22వ తేదీ నుంచి ఆశ్వయుజమాసం కారణంగా అక్టోబరు 21వతేదీ వరకు ముహూర్తాల కరువు ఏర్పడనుంది. అక్టోబరు 24వ తేదీ నుంచి తిరిగి ముహూర్తాలు కొనసాగనున్నాయి. మరోవైపు ఈ నెల 28వ తేదీన వాస్తు కర్తరి సమాప్తం కానుంది. దీంతో గృహ ప్రవేశాలు, బావులతవ్వకం, బోర్లు వేయడం, కట్టె పనులకు జూన్8 వరకు అనుకూలం.

మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ



ఎగిసి పడుతున్న మిషన్‌భగీరథ నీరు

ఎలిగేడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ధూళికట్టకు వెళ్లే ఆర్ అండ్‌బీరోడ్డుకు ఆనుకొని ఉన్న మిషన్ భగీరథ మెయిన్‌పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. అయినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీపై గ్రిడ్ ఇంజనీరింగ్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నం చేయగా వారు అందుబాటులో లేరు.

పుష్కరాల్లో ఏర్పాట్ల పరిశీలన

భగత్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లిజిల్లా కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కారాల్లో బస్‌స్టేషన్ వద్ద ఏర్పాట్లను ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి.రాజు, వరంగల్ రీజనల్ మేనేజర్ విజయభాను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా బస్‌స్టేషన్‌లో భక్తుల రద్దీని పర్యవేక్షించారు. భక్తులు గమ్యస్థానాలకు చేరుకోవడంలో అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

నల్ల బ్యాడ్జీలతో జూనియర్ లెక్చరర్ల నిరసన

- వార్షిక ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలని డిమాండ్

జగిత్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఆదివారం జగిత్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు రెగ్యులరైజ్డ్ జూనియర్ లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు. 2023 మే 3వ తేదీన జీవో నంబరు 16 ద్వారా పలు శాఖలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 426 మంది రెగ్యులరైజ్ అయ్యారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 131 మంది అధ్యాపకులు రెగ్యులరైజ్ అయ్యారు. 2024 మే నెలలో ఈ ఉద్యోగులు మొదటి ఏడాది ఇంక్రిమెంట్ పొందారు. 2025 మే నెలలో రెండవ సంవత్సరానికి సంబంధించిన ఇంక్రిమెంట్‌ను పొందవలసి ఉంది. అయితే సంబంధిత ఇంక్రిమెంట్‌ను పొందడానికి మే నెల చివరి వారంలో ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాలోని పలువురు అధ్యాపకులకు సంబంధిత కళాశాల డీడీఓలు, అధికారులు ఇంక్రిమెంట్ బిల్లులు సమర్పించకపోవడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లోనూ ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే కొన్ని జిల్లాలలో ఇంక్రిమెంట్లు చేయడం, మరికొన్ని జిల్లాల్లో చేయకపోవడంతో అధ్యాపకుల్లో గందరగోళం నెలకొన్నది. వరంగల్, నిజామాబాద్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాలలో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌లు రెండవ ఇంక్రిమెంట్ అందించేందుకు బిల్లులను రూపొందించి డీటీఓల్లో సబ్మిట్ చేశారు. కానీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాత్రం రెండవ ఇంక్రిమెంట్ లేకుండానే బిల్లులను రూపొందించినట్లు బాధిత అధ్యాపకులు అంటున్నారు.



జగిత్యాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

స్నేహపూర్వక వాతావరణాన్ని దెబ్బ తీయొద్దు
-కొట్టాల తిరుపతిరెడ్డి, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు



ఇంక్రిమెంటు పొందడం ఉద్యోగుల హక్కు. ఏడాది పాటు ఉద్యోగి అందించిన సేవలకు ప్రతిఫలంగా ప్రభుత్వం అందించే ఇంక్రిమెంట్‌ను ఆపడం బాధాకరం. కళాశాలల్లోని సామరస్య వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొద్దిమంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్డ్ జూనియర్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ అందించాలి.

బోర్డు నిబంధనల మేరకు చర్యలు
-బొప్పరాతి నారాయణ, జగిత్యాల జిల్లా ఇంటర్ విద్యాధికారి

రెగ్యులరైజ్ అయిన జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ఇంక్రిమెంట్ కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, ఇతర కారణాల వల్ల కొంత జాప్యం నెలకొంది. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. రెగ్యులరైజ్ అయిన అధ్యాపకుల సర్టిఫికెట్ వెరిఫికేషన్, పోలీస్ ఎంక్వయిరీ పూర్తి చేయాల్సి ఉంది. అధ్యాపకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

- ఎగువ నుంచి 2,315 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 2,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 12.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 7.568 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 652 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా 2024 జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 292.350 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 287.642 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ఏసీటీఓలకు.. అందని గెజిటెడ్ హోదా

- ప్రభుత్వాలు మారినా నెరవేరని కల
- ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు



కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా అందని ద్రాక్షలా మారింది. క్షేత్ర స్థాయిలో అమ్మకపు పన్ను (జీఎస్‌టీ) వసూలు చేయడంలో అత్యంత కీలకభూమిక పోషిస్తున్న ఏసీటీఓలు ఒక్క రూపాయి అదనపు భారం లేని గెజిటెడ్ హోదా కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. 2017లో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆనాటి ప్రభుత్వానికి ఏసీటీఓల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి గెజిటెడ్ హోదా ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. అదే సమయంలో ఆనాటి టీఆర్‌సీతో పాటు కొంత మంది అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం, సీపీఎం వంటి ప్రతిపక్ష పార్టీలు కూడా ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలంటూ ప్రభుత్వానికి సూచించారు. అయితే ఏసీటీఓల న్యాయమైన డిమాండ్‌కు మద్దతు పలుకుతూ గెజిటెడ్ అధికారుల సంఘం కూడా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ద్వారా నియమితులైన ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పటి వరకు వారి న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి నోచుకోలేదు. గత ప్రభుత్వం తమకు న్యాయం చేయలేదని కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించి గెజిటెడ్ హోదా కల్పించాలని ఏసీటీఓలు కోరుతున్నారు. రాష్ట్రంలో 537మంది ఏసీటీఓలు గెజిటెడ్ హోదా అర్హత కలిగి, నాన్ గెజిటెడ్ ఉద్యోగులగానే సేవలందిస్తున్నారు. కరీంనగర్ డివిజన్‌లో 20 మంది ఏసీటీఓలు పన్నుల వసూళ్ల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. కొంత మంది ఇప్పటికే నాన్ గెజిటెడ్ ఉద్యోగులుగానే పదవీ విరమణ పొందారని ఇప్పటికైనా ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించాలని ఏసీటీవోలు కోరుతున్నారు.

వెంటనే గెజిటెడ్ హోదా కల్పించాలి
- ముజాహిద్ హుస్సేన్, వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించి గ్రూప్-2 ద్వారా నియమితులైన ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి. గ్రూప్-2 ద్వారా నియమితులైన వారు ఇతర శాఖల్లో డిప్యూటీ తహశీల్దార్లుగా, సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌లు, మున్సిపల్ కమిషనర్లుగా విధులు నిర్వహిస్తూ గెజిటెడ్ హోదాలో ఉన్నారు. పన్నుల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంచుతున్న ఏసీటీవోలకు మాత్రం గెజిటెడ్ హోదా ఇవ్వడం లేదు.

భక్తజన సంద్రం.. రాజన్న ఆలయం

- ఘనంగా మహాలింగార్చన
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60వేలమంది భక్తులు తరలి వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేశారు. శ్రీరాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు.ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేకపూజలో పాల్గొని తిరిగిప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, పీఆర్వో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాస శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీస్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా ముస్తాబాద్ మండలం రాజక్కపేట గ్రామానికిచెందిన కోమటిరెడ్డి రాజిరెడ్డి సరిత దంపతులు రాజన్న నిత్యాన్నదాన సత్రానికి లక్ష రూపాయలు విరాళంగా ఏఈవో శ్రావణ్ కుమార్‌కు చెక్కును అందజేశారు.



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న సేవలో సినీ డైరెక్టర్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలుగు సినీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ ముద్దం నరేష్‌వర్మ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయఅర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడిజిల్లాస్థాయి క్రికెట్ లీగ్‌పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అండర్-25 విభాగంలో మొదటిమ్యాచ్‌లను కరీంనగర్, వేములవాడలలో నిర్వహించారు. జిల్లాక్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి. ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు పోటీలను ప్రారంభించారు. మొదటిమ్యాచ్ జిల్లాకేంద్రంలోని సెయింట్‌అల్ఫోన్స్ మైదానంలో నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో పెద్దపల్లి జట్టుపై కరీంనగర్‌టౌన్ విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో జగిత్యాల జట్టుపై కరీంనగర్‌రూరల్ జట్టు గెలుపొందింది. వేములవాడలో జరిగిన మరో మ్యాచ్‌లో హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గ జట్టు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ జట్టుపై విజయం సాధించింది.



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న అంపైర్లు

ఈశ్వర కృప ఆశ్రమ సందర్శన

కోల్‌సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): వీర్లపల్లిలోని ఈశ్వర కృప ఆశ్రమాన్ని ఆదివా రం ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స, డీజీఎం(మెకానికల్) రమేష్ ఠాకూర్, డీజీఎం (హెచ్‌ఎం) సోమనాథ్ సందర్శించారు. ఆశ్రమ పరిసరాలను, భవనాలు, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జీవిత చారమాంకంలో వృద్ధులకు మంచి ఆశ్రయం దొరికిందన్నారు. ఆశ్రమ నిర్వాహకులు పీటీ స్వామి, జాక సత్యనారాయణ, జీ సత్తయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధనమ్మకు ఎమ్మెల్యే ఘన నివాళి

మార్కండేయకాలనీ, మే 25(ఆంధ్రజ్యోతి): పీసీసీ సెక్రటరీ ప్రకాష్ తల్లి పి మదనమ్మ వర్ధంతి సభ ఆదివారం గోదావరిఖని జ్యోతినగర్‌లో నిర్వహించగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ హాజరై ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పుష్కరాలకు ఉచిత బస్సులు

ముత్తారం, మే 25 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తరలి వెళ్లారు. వారికి దారిలో శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు లడ్డు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజిద్ పాషా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినీత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తా విస్తరణకు శ్రీకారం

- సుల్తానాబాద్‌లో ఐబీ గదులు కూల్చివేతకు రంగం సిద్ధం - కొత్త గదుల నిర్మాణం ప్రారంభం - రోడ్డు వెడల్పుతో రాకపోకలు సులువు



సుల్తానాబాద్‌లోని తెలంగాణ చౌరస్తా



కూల్చివేయనున్న ఐబీ షెటర్లు



నిర్మాణం అవుతున్న దుకాణ సముదాయం

సుల్తానాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఎంతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా ప్రాంతం వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఐబీ నుంచి తహసీల్దార్ మండల పరిషత్ కార్యాలయాల మీదుగా కొత్త రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్డు వెడల్పు చేసి ఇరుపక్కల కంకరతో నింపి వదిలేశారు. ఇందులో భాగంగా ఐబీ చౌరస్తా చుట్టు ఉన్న దుకాణాలను తొలగించాలని నిర్ణయించారు. కుడి పక్కనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కొన్ని షాపింగ్ కాంప్లెక్స్ గదులు, ఎడమ వైపు గల ఐబీ కాంప్లెక్స్ గదులు కూడా తొలగించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు, కాలేజీ ఉన్నతాధికారులు, స్థానిక రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులతో కలసి ఎమ్మెల్యే విజయరమణారావు రోడ్డు వెడల్పు, గదుల తొలగింపు అంశాలపై క్షేత్రస్థాయిల్లో పలుసార్లు పరిశీలించి అధికారులకు తగిన సలహాలు సూచనలు అందించారు. ఐబీ చౌరస్తా వెడల్పులో భాగంగా ఐబీ కాంప్లెక్స్ గదులు, రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న హోటల్ ఇతర షెడ్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. గదులు తొలగించడం వలన అందులో ఉన్న వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కూల్చివేసే గదుల వెనక భాగంలో ముందుగా కొత్తగా గదుల నిర్మాణం చేపట్టా రు. ఇవి పూర్తయిన వెంటనే రోడ్డు పక్కనున్న గదులు కూల్చివేసి రోడ్డు పనులు ప్రారంభిస్తామని అధికారులు అంటున్నారు.

● భారీ వాహనాల రాకపోకలకు..

ఐబీ చౌరస్తా గుండా నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంతంలోని వందలాది రైస్ మిల్లులు ఉండగా వాటి నుంచి ప్రతీ వ్యవసాయ సీజన్‌లో వందల కొద్ది ధాన్యం లారీలు వస్తూ పోతుంటాయి. రైల్వేస్టేషన్ వద్ద గల వ్యాగన్ షెడ్డులో అందుబాటులో ఉన్న వ్యాగన్లలో బియ్యం ఎగుమతి జరుగుతుంది. దాని కోసం బియ్యం లారీలు నిత్యం ఈ దారిలో వెళ్తాయి. అలాగే సుద్దాల, కదంబపూర్, తొగర్రాయి, కనుకుల శివారుల్లోని పెద్దపెద్ద గోదాములకు కూడా ధాన్యం లారీలు వస్తాయి. గ్రానైట్ క్వారీల నుంచి బండ రాళ్లతో భారీ ట్రాలీలు వెళ్తుంటాయి. ఇసుక, మట్టి లారీలు, ట్రాక్టర్లు ఇలా అనేక వాహనాలు వస్తుంటాయి. జమ్మికుంట, హుజూరాబాద్, హన్మకొండ వంటి పట్టణాలకు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పొత్కపల్లి వంటి గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సులు ఇతర ప్రైవేట్ వాహనాలు కూడా ఎక్కువగా వెళ్తుంటాయి. ఇలా అత్యంత రద్దీగా ఉన్న ఐబీ చౌరస్తా విస్తరణ రోడ్డు వెడల్పు అత్యంత ఆవశ్యకరమని ఎమ్మెల్యే గుర్తించి నిధులు మంజూరు చేశారు.

● వేగంగా కొత్త గదుల నిర్మాణం ..

ఐబీ ఆవరణలో చేపట్టిన కొత్త షాపింగ్ గదుల నిర్మాణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే విజయరమణారావు ఈ పనులను ప్రారంభించారు. రోడ్డు విస్తరణలో తొలగించనున్న 18 గదులకు గాను కొత్తగా వాటిని ఐబీ ఆవరణలో నిర్మిస్తున్నారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ నిధులు కూడా మంజూరు చేశారు. ఐబీ గదుల తొలగింపుతో రోడ్డు విస్తరణకు నోచుకుంటుంది. అలాగే కాలేజీ కాంప్లెక్స్ గదులు కూడా తొలగిస్తే చౌరస్తా మరింత విస్తరణ జరిగి భారీ వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

యూరియా టెన్షన్

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రానికి ఇచ్చి మిగతా యూరియాను ఏపీ, తమిళ నాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో నీటి లభ్యత కారణంగా సాగు విస్తీర్ణత పెరిగింది. ఒక వర్షాకా లంలోనే కోటి మూపైలక్షల ఎకరాలలో సాగు చేసినట్లు లెక్కలు కట్టారు. యాసంగిలో సాగు విస్తీర్ణం తక్కువ అవుతుందని అంచనా వేసి వ్యవసాయ శాఖ యూరియా నిల్వలను తక్కువస్థాయిలో తెచ్చిపెట్టుకుంది. దీంతో యాసంగిలో యూరియా డిమాండ్ అమాంతంగా పెరగడంతో గొడవలు మొదలయ్యాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ యుద్ధప్రాతిపదికన ఉత్తర, దక్షిణ తెలంగాణకు యూరియా సరఫరా చేసింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని భాగస్వామ్య సంస్థ అయిన నేషనల్ ఫెర్టిలైజర్స్ (ఎన్‌ఎఫ్‌ఎల్) విజయపురి ప్లాంట్ నుంచి 10వేల టన్నులు తెప్పించి సర్దుబాటు చేసింది.

ఉత్పత్తి ప్రారంభమైతేనే..

ఈఏడాది రోహిణి కార్తెకి ముందే వర్షాలు కురవడం, నైరుతి రుతుపవనాలు వస్తుండటంతో సీజన్ ముందస్తుగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. శ్రీరాంసాగర్ ఆయకట్టు అయిన ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్‌తో పాటు వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మొదట సాగు ప్రారంభమవుతుంది. సాధారణంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి రేకుల ద్వారా ఈ జిల్లాలకు మొదట యూరియాను సరఫరా చేస్తారు. తరువాత నాగార్జున్ సాగర్ ఆయకట్టు ప్రాంతాలైన ఉమ్మడి నల్గొండ జిల్లాలకు యూరియా సరఫరా చేస్తారు. జూన్ రెండో వారంలోగా ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి జరిగితే ప్రతీరోజు రెండు రేకుల్లో యూరియాను పంపించే అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాలకు యూరియా సరఫరాను నిలిపివేసి మొత్తం యూరియాను రాష్ట్రానికి పంపితే జూన్‌లో 60వేల టన్నుల సరఫరాకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఎన్‌ఎఫ్‌ఎల్ విజయపురి ప్లాంట్ నుంచి 10వేల టన్నుల యూరయను తెప్పించేందుకు ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రణాళికలు చేస్తుంది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తయిన యూరియాను జూన్, జూలై నెలల్లో రాష్ట్రానికి ఇవ్వాలంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వర్షాకాలం సీజన్‌లో రాష్ట్రానికి యూరియా కేటాయింపులే కేంద్రం కుదించిన పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా పెంచుతారా అనేది సందేహం కలుగుతోంది.

నిరుపేద వివాహానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సభ్యులు

పెద్దపల్లి(కమాన్‌పూర్) మే 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎండీ ఫహీం కూతురు పర్వీన్ వివాహానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తమవంతుగా రూ.32,525 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఫహీం ఆర్థిక పరిస్థితిపై హెల్పింగ్ హ్యాండ్స్ మహిళా అధ్యక్షురాలు నారగోని సరితను సంప్రదించగా సంస్థ సభ్యులందరూ కలిసి దాతల నుంచి విరాళాలు సేకరించారు. నగదుతోపాటు క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు ఫహీం కృతజ్ఞతలు తెలిపాడు.

యువతి వివాహానికి...

మార్కండేయకాలనీ, మే 25(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే అమ్మానాన్నలను కోల్పోయిన మీర్జాకు వివాహానికి త్రిశక్తి మాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజర్ శ్రవణ్ కుమార్ ఆర్థికసాయం అందజేశారు. ఈనెల 29న వివాహం జరగనుండడంతో మీర్జా కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.5వేలు అందజేశారు.కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమ, ఆఫీస్, అలీమ్, అఫ్జల్ పాల్గొన్నారు.

'ఆకలి కేకలు' మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి(కమాన్‌పూర్) మే 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆకలి కేకలు మహాసభ కార్యక్రమ పోస్టర్‌ను స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా జేఏసీ అధ్యక్షుడు మట్టనర్సయ్య, మండల జేఏసీ అధ్యక్షుడు కందుల నర్సింగం, నాయకులు సదానందం, తిరుపతి, రెడ్డిశేఖర్, కాస రవి, ఓదెలు పాల్గొన్నారు.

ఎంపీకి ప్రొటోకాల్ ఇవ్వలేదని అడిగితే నిందలా?



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్, కోటేశ్వర్

గోదావరిఖని, మే 25(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణకు సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రొటోకాల్ పాటించలేదని దేవాదాయ శాఖను ప్రశ్నించినందుకు నిందలు వేయడం సబబు కాదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్, కోటేశ్వర్ అన్నారు. ఆదివారం ఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పుష్కరాల ఫ్లెక్సీలో ఎంపీ వంశీకృష్ణ ఫొటో లేకుండా దేవాదాయ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు పలు చోట్ల నిరసనలు తెలిపారే తప్ప ఎక్కడా మంత్రి శ్రీధర్ బాబు పేరును ప్రస్తావించలేదని తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సూచనల మేరకు కొందరు వ్యక్తులు కాకా కుటుంబంపై పనిగట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అడ్డుకోలే దని, కేవలం మాలలకు న్యాయం చేయాలని మాత్రమే ఆయన కోరినట్టు పేర్కొన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునఃప్రారంభానికి రూ. 10వేల కోట్లు మారటోరియమ్ ఇప్పించడం, జైపూర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, రామగుండం రైల్వే స్టేషన్ దారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కాకా కుటుంబం తో సాధ్యమయ్యాయని వారు తెలిపారు. సింగరేణిలో ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా గెలవకపోవడానికి ప్రధాన కారణం సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అని పేర్కొన్నారు. యూనియన్‌లో డబ్బులు ఇచ్చిన వారికే పదవులు అప్పగిస్తున్నారని, నియంతృత్వ పోకడలతో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలను ఖాతరు చేయడం లేదని పేర్కొన్నారు. ఐఎన్‌టీ యూసీ అధ్యక్షుడిగా వెంట్రావ్ ఉన్న సమయంలో జనక్‌ప్రసాద్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటుకు సిద్ధమైతే జాతీయ అధ్యక్షుడు సంజీ వరెడ్డి అనుమతి ఇవ్వలేదని, వివేక్ చొరవ తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడి జనక్‌ప్రసాద్ పెట్టిన యూనియన్‌కు గుర్తింపు ఇచ్చేలా కృషి చేసినట్టు తెలిపారు. కొందరి మెప్పు పొందేందుకు తనకు అన్నివిధాల అండగా నిలిచిన కాకా కుటుంబాన్ని జనక్‌ప్రసాద్ బద్నాం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకా ఫ్యామిలీపై లేనిపోని ఆరోపణలు చేస్తే సమించేది లేదని, అటువంటి వారికి బుద్ధి చెప్పేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి, విజయ్, తిప్పారపు మధు, మల్లేష్ యాదవ్, సురేందర్, రఫీక్, విజయ్, రాజేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కులం పేరుతో మంథనిలో చిచ్చుపెట్టొద్దు

రామగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): కులంపేరుతో మంథని నియోజకవర్గంలో వివేక్ కుటుంబం చిచ్చు పెడుతుండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అది సరైన విధానం కాదని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ కుటుంబం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వివేక్ కుటుంబం కుల రాజకీయాలు మానుకోవాలని సూచించారు. సరస్వతి పుష్కరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేయించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు రామిల్ల మనోహర్, కిషన్‌నాయక్, సదానందం, నారెడ్ల శ్రీనివాస్‌రావు, మండల కొమురయ్య, ఎండి జుబేర్, గడ్డం తిరుపతి, ఎల్లంకి రామారావు, రాజ్‌కుమార్, సత్రం సమ్మయ్య, సాయి, కృష్ణ, సుధాకర్, కుమారస్వామి, సందీప్, రవి పాల్గొన్నారు.

విద్యావ్యాప్తిని ఉద్యమంగా సాగిద్దాం

కరీంనగర్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి, విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కీలకంగా ఉన్న ఉపాధ్యాయులు విద్యావ్యాప్తిని ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలని, అప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని టీజీఈ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) రాష్ట్రస్థాయి ఉద్యమ అధ్యయన తరగతులను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డిలతో కలిసి మారం జగదీశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న అన్ని రకాల సమస్యలకు, అభివృద్ధికి ప్రధాన ఆటంకం విద్యావంతుల కొరతేనని, గుణాత్మకమైన విద్యను సాధించినప్పుడే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. సమాజంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించడం, విజ్ఞానవంతమైన సమాజంగా అభివృద్ధి పరచడంలో కీలకపాత్ర పోషించేది ఉపాధ్యాయులేనని, ఆ బాధ్యత గుర్తెరిగి ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సారథ్యంలో ఏర్పడిన జేఏసీ హక్కుల సాధనలో ముందుంటుందని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఉద్యోగులందరికీ సమస్యల పరిష్కారానికి ముందడుగు పడుతుందని తెలిపారు. ఉద్యమ అధ్యయన తరగతుల ప్రిన్సిపాల్, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు సుబ్బా రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మానేటి ప్రతాపరెడ్డి, సంఘ చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ విష్ణుమూర్తి, ఎస్ ప్రభాకర్‌రావు, ఖాజా మంజూర్ అలీ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మునీర్ మరణం తీరని లోటు

సీఎండీ ఎన్ బలరామ్

గోదావరిఖని, మే 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్‌గా, పలు సమాజ హిత ఉద్యమాలలో కీలక భూమిక పోషించిన మునీర్ మరణం పాత్రికేయ రంగానికే గాక తెలంగాణ సమాజానికి తీరని లోటని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మునీర్ పాత్రికేయుడిగా పనిచేస్తూ, కార్మిక పక్షపాతిగా అనేక సింగరేణి కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారన్నారు. చివరి వరకు పాత్రికేయులుగానే కొనసాగుతూ అనేక సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రజాసేవ చేశారన్నారు. ఆయన అకాల మరణంపై సంతాపం తెలిపారు.

● మునీర్ ఆకస్మిక మరణం సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటని ఇంటరనేషనల్ దళిత జర్నలిస్ట్ నెటవర్క్(ఐడీజేఎన్) చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మంద జనార్ధన్, కో కన్వీనర్ ఎడ్ల సంజీవ్ అన్నారు. మునీర్ కార్మికుడిగా పని చేస్తూనే కార్మిక సమస్యపై స్పందిస్తూ జర్నలిస్టుగా కొనసాగారన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా అన్ని బాధ్యతలను ప్రేమతో, సమర్థవంతంగా నిర్వహించిన గొప్ప నాయకుడని, అటువంటి నాయకుడిని కోల్పోవడం భవిష్యత్ సమాజానికి ఎనలేని నష్టమన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటన్నారు. మునీర్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

ఉస్మానియా అభివృద్ధికి సహకారం గర్వకారణం

- సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఈసీఈ భవంతి - ప్రారంభించిన సీఎండీ బలరామ్, ఉస్మానియా వీసీ కుమార్



ఈసీఈ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ బలరామ్, ఓయూ వీసీ కుమార్

గోదావరిఖని, మే 25 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి సింగరేణి సంస్థ సహకరించడం ఎంతో గర్వకారణంగా ఉందని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ శాఖలో దాదాపు రెండు కోట్ల రూపాయల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్స్‌ను సీఎండీ బలరామ్, యూనివర్సిటీ వీసీ కుమార్ మొలుగారంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యారంగాన్ని ఆధునికీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తోందన్నారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించడానికి కూడా పూర్తిస్థాయిలో సహకరించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ఉస్మానియాలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో సింగరేణి తరుపున అధ్యాపకులను కేటాయించింద ని తెలిపారు. ప్రొఫెసర్ చైర్ పథకం కింద నిధులు కూడా కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇవే కాకుండా పెద్దపల్లి జిల్లాలో జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించినట్లు తెలిపారు.

అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ వీసీ కుమార్ మొగులారం మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర గల సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతానికి గర్వకారణమని, ఉస్మానియా యూనివర్సిటీకి సింగరేణి అందించిన ఆర్థిక సహాయం మరువలేనిదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ బోధన తిరిగి ప్రారంభించేందుకు కూడా పూర్తి సహకారం అందించిందని కొనియాడారు. ఇకపై కూడా సింగరేణి తన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి నరేష్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్, ఈసీఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ డి రామకృష్ణ, సింగరేణి అధికారులు ఎన్.భాస్కర్, జి.రమేష్, సతీష్ తదితరులుపాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 అధికారులతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం స్థానిక ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం లలిత కుమార్, వివిధ విభాగాల అధికా రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్మికవాడల్లో అంతర్గత రహదారుల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని, వర్షాకాలం ముందే మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, కార్మికవర్గాలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. బస్టాండ్ సమీపంలో రోడ్లు, లైటింగ్ పనులు చేపట్టాలన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతమైన జనగామలో అభివృద్ధి పనులు చేపట్టాలని, రోడ్లు, ఇతర లైటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గోదావరిఖని పట్టణంలో రహదారులను విస్తరించి అభివృద్ధి చేయా లని కోరారు. ముస్లింలకు ఖబరస్థాన్‌ను వెంటనే పూర్తి చేయాలని, రెండో గని సమీపంలో నిర్మిస్తున్న ఎస్‌టీపీని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమీక్షలో సింగరేణి ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్ తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి): సీఈఆర్ క్లబ్‌ను ఆదివారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తనిఖీ చేశారు. పూల్ నిర్వహణ, వేసవిలో స్విమ్మింగ్‌కు వస్తున్న వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం టేబుల్ టెన్నిస్ కోర్టును జీఎం పరిశీలించారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు ఆహ్లాదాన్ని అందించేలా ఖర్చుకు వెనకాడకుండా అత్యుత్తమ సదుపాయాలు కల్పించామన్నారు. ఉద్యోగులు సంస్థ అందిస్తున్న క్రీడా వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్యం మెరుగుపడేందుకు క్రీడలు ఉపయోగపడతాయని, సీఈఆర్ క్లబ్‌లో వసతులను వినియోగించుకోవాలని సూచించారు. జీఎం వెంట ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ, అధికారుల సంఘం ప్రతినిధి జనార్దన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పోశం ఉన్నారు.



వెల్ఫేర్ ఆఫీసర్ కుటుంబానికి చేయూత



రాజు కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న పీవో

యైటింక్లయిన్‌కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ఓసీపీ-3 వెల్ఫేర్ ఆఫీసర్ పీ రాజు కుటుంబానికి తోటి అధికారులు అండగా నిలిచారు. ప్రాజెక్టులో పని చేస్తున్న అధికారులు తమవంతు సాయంగా ఆర్థిక సాయం చేశారు. ఆదివారం రాజు కుటుంబాన్ని కలిసి అండగా ఉంటామని తెలిపారు. ప్రాజెక్టు అధికారి ఉదయ్ హరిజన్ చేతుల మీదుగా సేకరించిన మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ భరత్‌కుమార్, అధికారుల జనరల్ సెక్రెటరీ నర్సింహులుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



క్రీడా దస్తులు అందజేస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఉద్దేశంతో వేసవి సెలవుల్లో ఉచిత క్రీడాశిబిరాలను సింగరేణి నిర్వహిస్తున్నట్టు ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో జరిగిన వేసవి క్రీడా శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం విద్యా బోధన పద్ధతులు మారాయని, ర్యాంకులు, మార్కులే ప్రామాణికంగా విద్యాసంస్థలు పనిచేస్తున్నట్టు తెలిపారు. దీంతో విద్యార్థులు మానసికోల్లాసానికి దూరం అవుతున్నారని, శారరకంగా బలహీనంగా తయారు అవుతున్నట్టు జీఎం తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులను దేశానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని జీఎం అన్నారు. విద్యార్థి దశనుంచే ఏదైనా ఆటలో నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, అధికారుల సంఘం ప్రతినిధి జనార్ధన్, డీవైపీఎం వంశీధర్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పోశం, ఏఐటీయూసీ నాయకులు శ్యాంసన్, సాంబశివరావు, రవీందర్ పాల్గొన్నారు.